



అమరావతి అశేష జనవాహిని మధ్య స్వామి వార్ల రథోత్సవం

కమనీయం రథోత్సవం

ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి అమరేశ్వరుని లింగోద్భవ అభిషేకాల అనంతరం బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి కల్యాణోత్సవం జరిగింది. ఆలయంలోని స్వామి కల్యాణ మండపంలో కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ ప్రధానాచార్యులు, వేదపండితులు, అర్చకులు కల్యాణాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు జాగారం చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామివార్ల తలంబ్రాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం గురువారం ఉదయం నూతన దంపతులైన ఉత్సవమూర్తులు హంస, నంది, మిద్దె రథంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవున భక్తులు స్వామి వార్లకు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కీలుగుర్రంపై గ్రామోత్సవంలో విహరించారు.

- భక్తిశ్రద్ధల మధ్య అమరేశ్వరుని రథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన అమరావతి వీధులు
- జాగారం చేసి కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- హంస, నంది, మిద్దె రథంపై కల్యాణమూర్తుల గ్రామోత్సవం



రథోత్సవం ముందు వివిధ వేషధారణలో కళాకారులు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జై.. సాంబశివ.. శంభో.. శంకర.. శివశంకర.. నామస్మరణలతో అమరావతి వీధులు మారుమోగాయి. భక్తుల జయజయధ్వానాలు.. మంగళవాయిద్యాలు.. డ్రోన్లతో ఆకాశం నుంచి పూల వర్షం కురుస్తుండగా.. వేదమంత్రోశ్చరణల మధ్య గురువారం సాయంత్రం అమరేశ్వరుని రథోత్సవం అమరావతి పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల సమక్షంలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం గురువారం సాయంత్రం దేవతామూర్తుల రథోత్సవం భక్తుల శివనామ స్మరణలతో అంబరాన్ని తాకింది. ముందుగా స్వామివార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రథశాలకు తీసువచ్చి పూలతో అలంకరించిన రథంపై ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, హరిబాబు, ఈవో సునీల్‌కుమార్ టెంకాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి పురవీధులు కిటకిటలాడాయి. డీఎస్పీలు హనుమంతరావు, వెంకటరమణల పర్యవేక్షణలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నాలుగు డ్రోన్ కెమేరాలతో రథోత్సవాన్ని పోలీసులు పర్యవేక్షించారు. కళాకారుల ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు భక్తులను అలరించాయి.

కన్నుల పండువగా లింగోద్భవ అభిషేకాలు



7

కమనీయం.. మల్లేశ్వరుడి కల్యాణం



7



ఉన్నతంగా ఎదగడమే అసలైన విజయం

ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష



బూత్‌లో ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి



వేమూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ



గుంటూరులో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు

పట్టభద్రులు.. ఓటెత్తారు

- 69.57 శాతం పోలింగ్ నమోదు
- గతంలో కంటే 10 శాతంపైగా పెరుగుదల
- తమకే అనుకూలమంటున్న కూటమి నేతలు
- అవన్నీ రిగ్గింగ్ చేసినవేనని పీడీఎఫ్ వర్గాల ఆరోపణ

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులైన దివ్యాంగులు.. గర్భిణులు.. ఉద్యోగులు.. మహిళలు.. ఓటు వేసేందుకు పోటెత్తారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం వెల్లివెరిసింది. స్వల్ప తోపులాటలు మినహా ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. విద్యావంతులు అధిక సంఖ్యలో ఉండే గుంటూరు, విజయవాడ లాంటి నగరాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. గంటగంటకు పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఉదయం 10 గంటలకు 11.08 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 29.97 శాతం, 2 గంటలకు 49.06 శాతం, సాయంత్రం 4 గంటలకు 65.58, సమయం ముగిసినప్పటికీ అప్పటికే క్యూలో ఉన్న ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకుని పోలింగ్ ముగిసేసరికి 69.57 శాతానికి చేరుకున్నది. గురువారం ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించడం, ప్రైవేటు కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు ఓటు వేసి ఆలస్యంగా వచ్చినా అనుమతించాలని ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశాలు జారీ.. విద్యా సంస్థలకు సెలవు తదితరాలతో ఓటు వేసేందుకు పట్టభద్రులు పోలింగ్ బూత్‌లకు బారులు తీరారు. ఉదయం 7.30 గంటలకే బూత్‌ల వద్దకు చేరుకుని క్యూలో నిలుచుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. దివ్యాంగులైన పట్టభద్రులు వయస్సుతో సంబంధం లేకుండా పోలింగ్ బూత్‌లకు రావడం విశేషం. మరోవైపు గర్భిణులు, బాలింతలు కూడా వచ్చి ఓటు వేశారు. ఈ కారణంగానే గతంలో కంటే దాదాపుగా 10 శాతం పైగా పోలింగ్ పెరిగింది. 2019లో ఎన్నికలు జరిగినప్పుడు 59.39 శాతం పోలింగ్ నమోదైంది. ఈ దఫా 69.57 శాతానికి పెరిగింది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా దాదాపుగా 77.33 శాతం ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. గురవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన ఓటింగ్ ఆ తర్వాత ఊపందుకుంది. మధ్యాహ్నానికి ఓటర్లు పోలింగ్ స్టేషన్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 4 గంటలకు గడువు ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూల్లో ఉండడం గమనార్హం. ఆరు జిల్లాల పరిధిలో 483 పోలింగ్ బూత్‌లలో 2,41,502 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దాదాపు లక్షా 5 వేల 634 మంది పోలింగ్ బూత్ ముఖమే చూడలేదు. గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పోలింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రత్యేకంగా పరిశీలించారు.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం ఇలా...

జిల్లా పేరు	ఓటర్లు	ఓటేసిన వారు	శాతం
ఏలూరు	16099	11801	73.30
కృష్ణా	63114	44125	69.91
ఎన్‌టీఆర్	78063	51279	65.59
గుంటూరు	108109	71836	66.45
బాపట్ల	24493	18198	74.30
పల్నాడు	57238	44263	77.33
మొత్తం	347116	241502	69.57

☛ మొత్తం ఓటర్లు 3,47,116 మంది కాగా 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లున్నారు. వీరిలో పురుషులు 1,48,506 మంది, మహిళలు 92,994, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు పోలింగ్‌లో పాల్గొన్నారు. ఓటు హక్కు కలిగిన పురుషుల్లో 71.93 శాతం, మహిళల్లో 66.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

☛ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సిట్టింగ్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ రావ గుంటూరులో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

గుంటూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మద్దతుదారులు ఓటరు స్లిప్పులపై లక్ష్మణరావు ఫొటో ముద్రించి పంపిణీ చేస్తున్నారని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు లు వెళ్లాయి.



బూత్ వద్ద ఓటర్లతో సదుపాయాలపై అడిగి తెలుసుకుంటున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

☛ బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పోలింగ్ సరళిని కూటమి పార్టీలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి పరిశీలించారు.

☛ బాపట్ల జిల్లాలో 74.31 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా పరిధిలోని రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలోని 34 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిగింది. 24,493 మంది ఓటర్లకు 18,200 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

☛ బాపట్ల మున్సిపల్ హైస్కూల్ వద్ద గడువు ముగిసిన తర్వాత ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే విషయంలో టీడీపీ, పీడీఎఫ్ వర్గాల మధ్య తోపులాట జరిగింది. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, పీడీఎఫ్ మద్దతుదారుడు అనిల్‌పై దాడి చేశారు. ఈ నేపథ్యంలో కొద్ది సేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

స్ట్రాంగ్‌రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో సిబ్బంది బ్యాలెట్ బాక్సులకు ఏజంట్ల సమక్షంలో సీళ్లు వేశారు. అనంతరం వాటిని తీసుకుని రూట్‌ల వారీగా తమకు కేటాయించిన వాహనాల్లో ఏసీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు తరలివచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్లలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారంలు, పీవో డైరీ వంటివి క్షుణ్ణంగా పరిశీలించి బ్యాలెట్ బాక్సులను స్వీకరించి స్ట్రాంగ్‌రూంకు తరలించారు. పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, ఏలూరు, కృష్ణ జిల్లాల్లో స్థానికంగానే తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా జిల్లాల బ్యాలెట్ బాక్సులను అక్కడ స్వీకరించి వాటన్నింటిని కలిపి గుంటూరు ఏసీ కళాశాలకు తరలించడం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులు వచ్చిన తర్వాత ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలకు చేర్చి సీలు వేస్తామని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

గెలుపుపై ధీమా..

పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం అటు రాజకీయ, ఇటు అధికారవర్గాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పోలింగ్ శాతం గతంలో ఎన్నడూ లేని విధంగా పెరగడంతో ఎన్‌డీఏ కూటమి నేతలు తమకే అనుకూలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా ఓటింగ్ తమకు అనుకూలంగా జరిగిందని, ఖచ్చితంగా పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు తథ్యంగా ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. తాము పక్కా ప్రణాళికతో పట్టభద్రులను ఓటర్లుగా నమోదయ్యేందుకు శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి దరఖాస్తులు చేయించామని దీంతో ఓటర్ల సంఖ్య పెరిగిందని ఆలపాటి వర్గీయులు చెప్తున్నారు. తమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలన్న ఆకాంక్ష పట్టభద్రుల్లో కనిపించిందంటున్నారు. పెరిగిన పోలింగ్ శాతం ఖచ్చితంగా తమ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులోనే విజేతగా నిలబెడుతుందని చెబుతున్నారు. కాగా ఓటింగ్ శాతం గత మూడు పర్యాయాలు చూసుకుంటే 60 శాతం లోపే ఉండేదని, ఇప్పుడు అదనంగా 10 శాతం పైగా పెరగడానికి కారణం దొంగ ఓట్లు, రిగ్గింగ్, ఏజంట్లను పోలింగ్ బూత్‌ల నుంచి తరిమేయడమేనని పీడీఎఫ్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లాలో తమ ఏజంట్లను బూత్‌లలోకి రానీయకుండా ఓట్లు వేసుకున్నారని ఆరోపిస్తున్నారు.

నిధులకు వీడిన గ్రహణం

- నాలుగు పంచాయతీలకు సీనరేజీ నిధులు
- ఈ ఏడాది రూ.33 లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు
- మంత్రి రవికుమార్ ఆదేశాలతో వివాదానికి చెక్

బల్లికురవ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి వచ్చే సీనరేజీ నిధుల వాటాలలో నాలుగు పంచాయతీల మధ్య నెలకొన్న వివాదాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు అందరికీ ఆమోదయోగ్యంగా మరోసారి వాటాలను కేటాయించి వివాదానికి చెక్ పెట్టారు. వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే సీనరేజ్ నిధుల కేటాయింపులు జరిగే నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాల మధ్య రెండేళ్ల నుంచి వివాదం కొనసాగుతుంది. 2008లో అప్పటి అధికారుల సమక్షంలో గతంలో పనిచేసిన సర్పంచ్‌లు అన్ని గ్రామాలకు సీనరేజీ నిధులను కేటాయించారు. అందులో బాగంగా గతంలో కె.రాజుపాలేనికి 17 శాతం, కొణిదెనకు 24 శాతం, నక్కబొక్కలపాడుకు 27 శాతం, మల్లాయపాలేనికి 32 శాతం చొప్పున నిధులను కేటాయించేలా ఒప్పందం జరిగింది. అప్పటి నుంచి అన్ని పంచాయతీలకు వాటాల మేర సీనరేజీ నిధులను కేటాయిస్తూ వచ్చారు. గత వైసీపీ పాలనలో అప్పటి అధికారులు కొందరు సీనరేజీ నిధులను అన్ని పంచాయతీలకు కేటాయించకుండా ఒక్క కొణిదెన పంచాయతీకే రూ.1.45 కోట్లను జమ చేశారు. దీంతో మిగిలిన గ్రామాల సర్పంచ్‌లు తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ నిధులు వినియోగించకుండా హోల్డ్‌లో పెట్టించారు. దీంతో అటు కొణిదెన, ఇటు మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు నిధుల కేటాయింపుపై కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి నిధులు ఉండి కూడా వివాదంతో నాలుగు గ్రామాలలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వం దృష్టి

గత వైసీపీ పాలనలో జరిగిన తప్పుతో గ్రామ పంచాయతీల్లో నిధులు ఉండి అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని నక్కబొక్కలపాడు, రాజుపాలెం, మల్లాయపాలెం గ్రామాల సర్పంచ్‌లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో మంత్రి వెంటనే కలెక్టర్ వెంకటమురళికి సీనరేజీ నిధుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రంగంలోకి దిగిన అధికారులు రెవెన్యూ, మైనింగ్, జిల్లా పంచాయతీ అధికారులు త్రీ మన్ కమిటీగా ఏర్పడి గత నెలలో క్వారీ భూములను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఆ నివేదికల ఆధారంగా మరో మారు పంచాయతీలకు వాటాల మేర నిధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో ప్రభాకరరావు ఉత్తర్వులు ఇచ్చారు.

కేటాయింపులు ఇలా..

త్రీమన్ కమిటీ ద్వారా అధికారులు జరిపిన పరిశీలన మేరకు కొణిదెన పంచాయతీకి 30 శాతం, మల్లాయపాలేనికి 30 శాతం, నక్కబొక్కలపాడుకు 25 శాతం, కె.రాజుపాలేనికి 15 శాతం చొప్పున ఈ ఏడాది నుంచి గ్రానైట్ క్వారీల ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు కేటాయింపులు చేస్తామని అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో కోర్టులో వివాదంగా ఉన్న రూ.1.45 కోట్ల నిధుల విషయం కోర్టులో పంచాయతీలు కేసులను ఉపసంహరించుకుంటే అందరికీ వాటాల మేరకు పెండింగ్ నిధులు కూడా జమ చేస్తామన్నారు. వివాదం సమిసి సీనరేజీ నిధుల కేటాయింపులు జరగడంతో గ్రామాలలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. 2025 సంవత్సరానికి వాటాల ప్రకారం సీనరేజీ నిధులు కొణిదెనకు రూ.9.91 లక్షలు, మల్లాయపాలేనికి రూ.9.91లక్షలు, నక్కబొక్కలపాడుకు రూ.8. 25లక్షలు, కె.రాజుపాలేనికి రూ.4.95 లక్షలు జమ కానున్నాయి.

ప్రభలోత్సవం

- అంగరంగ వైభవంగా కోటయ్య తిరునాళ్ల
- విజయవంతంగా ముగిసిన త్రికోటేశ్వరుని ఉత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట) ఫిబ్రవరి 27: కోటయ్య క్షేత్రం ప్రభలతో కనువిందు చేసింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నేత్రపర్వంగా సాగాయి. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో ప్రభలు కనువిందు చేశాయి. అర్ధరాత్రి జాగరణకు తరలివచ్చిన కోటయ్య భక్తులు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి తరించారు. లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి త్రికోటేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.



తిరునాళ్ళలో కాంతులీనుతున్న ప్రభలు

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా ముగిశాయి. బుధవారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తడంతో త్రికూటాద్రి కిటకిటలాడింది. తిరునాళ్లలో 20 భారీ విద్యుత్ ప్రభలు భక్తులకు కనువిందు చేశాయి. ప్రభలపై నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొం డకు తరలివచ్చాయి. కోటయ్యస్వామి ఆశీస్సులతో తిరునాళ్ల ఉత్స వం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. నాదెండ్ల మండలం అప్పాపురం,అవిశాయపాలెం, చిలకలూరిపేట మండలం పురుషోత్తంపట్నం, కావూరు, కోమటినేనివారిపాలెం, కమ్మవారిపా లెం, యడవల్లి, మద్దిరాల, గోవిందాపురం, బొప్పూడి, నరసరావు పేట మండలం కాకాని, ఉప్పలపాడు, చింతలపాలెం, గురవాయ పాలెం గ్రామాల నుంచి తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభలు కొండ వద్ద కొలువు దీరాయి.

ఇచ్చిపుచ్చుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కేఆర్‌ఎంబీ త్రిసభ్య కమిటీ నెలకోసారి సమావేశమై.. పరిస్థితిని సమీక్షించుకుందాం' అని జైన్ ఈ సందర్భంగా సలహా ఇచ్చారు. వరద సమయంలోనూ పోతిరెడ్డిపాడు నుంచి నీటిని ఏపీ వాడుకుందని.. కేసీ కెనాల్ ద్వారా కూడా నీటిని వాడుకుందని గతంలో చేసిన ఆరోపణలనే తెలంగాణ ప్రస్తావించింది. నాగార్జున సాగర్ నుంచీ వాడేసుకుందని తెలిపింది. ఈ వాదనలను ఏపీ తీవ్రంగా ఖండించింది. వరద నీరు సముద్రంలోకి వెళ్తుంటే రాష్ట్రావసరాలకు వాడుకున్నామని పునరుద్ఘాటించింది. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తీసుకున్నా.. ఆ తర్వాత పై నుంచి వచ్చిన వరద కారణంగా శ్రీశైలం జలాశయం నిండినందున.. 20 టీఎంసీల నష్టం వాటిల్లిందన్న వాదనలోనూ పస లేదంది. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు నీటిని వదిలి సముద్రంపాలు చేసింది తెలంగాణేనని ఆక్షేపించింది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని.. గతంలో జరిగినవి ఇప్పుడు అప్రస్తుతమన్నారు. ప్రస్తుతం సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏపీకి వదులుతున్న ఏడు వేల క్యూసెక్కులు.. తెలంగాణ కోసం వదులుతున్న తొమ్మిది టీఎంసీలు.. పంటలను కాపాడుకోవడానికి సరిపోతాయో లేదో ఈఎన్‌సీల స్థాయిలో చర్చించుకోవాలన్నారు. ఉన్న నీటిని పంటలకు సర్దుకోవడం.. తాగునీటి అవసరాలు తీర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, హంద్రీ-నీవా నీటినీ సమీక్షించుకోవాలని సూచించారు. నెల తర్వాత కార్యదర్శుల స్థాయిలో మాట్లాడుకుని.. అవసరాలకు అనుగుణంగా సాగర్‌లో అందుబాటులో ఉన్న జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వాడుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాల సీఈల కమిటీ జూన్ వరకు ఏపీకి 55, తెలంగాణకు 63 టీఎంసీలు అవసరమంటూ ఇచ్చిన నివేదిక పైనా చర్చించారు. అనంతరం చైర్మన్ సూచన మేరకు ఈఎన్‌సీలు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్ సమావేశమై సుహృద్భావ వాతావరణంలో చర్చించుకున్నారు. పంటల రక్షణకు సాగర్ కుడి కాలువ నుంచి 7 వేల నుంచి 8 వేల క్యూసెక్కులు.. ఎడమ కాలువ నుంచి 7 వేల క్యూసెక్కులను వాడుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలం జలాల వాడకంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిచ్చేందుకు అంగీకరించారు.



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

100 రోజులు.. 1,596 మి. యూనిట్లు

- రికార్డు స్థాయిలో కృష్ణపట్నం మూడో యూనిట్ ఉత్పత్తి
- ఒక్కరోజే 4.949 మిలియన్ యూనిట్లు
- అద్భుతం సృష్టించిన సీలేరు జల కేంద్రం

అమరావతి, సీలేరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జెన్కో విద్యుదుత్పత్తి సంస్థలు రికార్డు స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం మూడో యూనిట్‌లో వంద రోజులుగా నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతూ 1596.30 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించింది. ఇక.. సీలేరు జల విద్యుత్ కేంద్రం 24 గంటల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో 4.949 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేసింది. ఇది ఈ కేంద్రం చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డు. ఆ వివరాలను జెన్కో గురువారం వెల్లడించింది. వేసవిలో విద్యుత్తు కొరత రానీయకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు వెల్లడించారు. జెన్కో విద్యుత్తు కేంద్రాలు 2025 జనవరి నుంచి ఇప్పటిదాకా సగటున 110 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన 123 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామన్నారు. నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం నుంచి తొలిసారిగా 95 మిలియన్ యూనిట్లను ఈ నెల 18న ఉత్పత్తి చేశామని తెలిపారు.

నెలరోజుల ముందుగానే లక్ష్యఛేదన

సీలేరు జల విద్యుత్ కేంద్రం ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిందని జెన్కో ఈఈ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం 477 మిలియన్ యూనిట్లకు గాను గురువారం (27వ తేదీ) ఉదయం నాటికి 477.644 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంజనీర్లను, సిబ్బందిని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈలు (ఓ అండ్ ఎం) చిన్న కామేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

కరెంటు కొనుగోలు బకాయి 6,556 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోలు బకాయిలు రూ.6,556.25 కోట్లకు చేరుకున్నాయి. ఇందులో గత నెల బకాయిలు రూ.1,873. కోట్లు దానికిముందు రెండు నెలల బకాయిలు రూ.4,653.24 కోట్లు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ 'ప్రాప్తి' పోర్టల్ వెల్లడించింది. తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని ఏపీపీసీసీని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కోరింది.

డిస్కమ్‌ల బలోపేతానికి సహకారం అందించండి

- సీమలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం నిరంతరం కావాల్సిందేనని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గురువారం రాష్ట్రాల ఇంధన శాఖల కార్యదర్శులు, మంత్రులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్న గొట్టిపాటి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని గొట్టిపాటి తెలిపారు. రాయలసీమలో సోలార్, పవన, పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే కరెంటును రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర సహకారాన్ని కోరగా, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మరోసారి సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశంలో కార్యాచరణను ప్రకటిస్తామని ఖట్టర్ వెల్లడించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.



పూజా హెగ్డే ప్రత్యేక గీతం

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం

- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.



అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్ర్కీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ, నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి

PARAS


త్రికోటేశ్వర స్వామికి క్షీరాభిషేకం


పెరుగుతో..


నెయ్యితో..


ఫలాలతో ..


ఎండు ఫలాలతో ..


కుంకుమతో ..


విభూదితో..


గంధంతో..


విశేష అలంకారంలో త్రికోటేశ్వరుడు

కనులపండువగా లింగోద్భవ అభిషేకాలు

కోటప్పకొండ (నరసరావుపేట) ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు కనులపండువగా, అత్యంత వైభవంగా జరిగాయి. పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, ఎండు ఫలాలు, విభూది, తేనె, పండ్ల రసాలు వివిధ ద్రవ్యాలతో స్వామికి లింగోద్భవ అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాల అనం తరం ప్రభుత్వం తరుపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమర్పించిన పట్టువస్త్రాలను స్వామికి అలంకరించారు. ఆలయ ట్రస్టీ మల్రాజు రామకృష్ణ కొండలరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. మల్లేశ్వరుని కల్యాణం

పెదకాకాని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్యాణం.. కమనీయం.. శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. మహాశివరాత్రి పర్వదినమున స్వామి ఏకాథ ద్రవ్యములతో లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. లింగోద్భవ అభిషేకం, గ్రామోత్సవ సేవలో శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం ప్రత్యేక వేదికపై అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ప్రముఖ కల్యాణ వ్యాఖ్యాత పుల్లాభట్ల వెంకటేశ్వర్లు కల్యాణ వ్యాఖానం చేశారు. భక్తులకు స్వామి వారి కల్యాణ అక్షింతలు, లడ్డూ ప్రసాదంను పంపిణీ చేసినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు.


శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

దివ్య రథోత్సవం

పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. నంది వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల ఆదాయం రూ.1.77 కోట్లు

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్లకు దేవస్థానానికి రూ. 1,77,68,918 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. గత ఏడాది కంటే రూ.14.19 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. గతేడాది రూ.1,63,48,227 ఆదాయం వచ్చింది. దర్శనం, అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.65,01,070, హుండీల ద్వారా రూ. 73,47,918, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.38.16 లక్షలు లభించిందని ఈవో వివరించారు. ఉత్సవ అధికారి చంద్రకుమార్, ఈవో డి.చంద్రశేఖరరావు, దేవదాయ శాఖ అధికారులు శ్రీధర్‌రెడ్డి, టి.సుధాకరరెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయ లెక్కింపు జరిగింది.

కంపచెట్లలో శిశువు

● గుంటూరుకు తరలిస్తుండగా 108లో మృతి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రక్తం మరకలు ఆరకముందే ఓ పసికందును కంపచెట్లలో పడేసిన సంఘటన మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని ఇటుకల బట్టిల వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలోని ఇటుకల బట్టీల వద్ద కంపచెట్లలో ఒళ్లంతా రక్తపు మరకలు, తొలగించని బొడ్డుతో శిశువు ఏడుస్తూ ఉండటంతో, కేకలు విన్న ప్లాస్టిక్ వస్తువులు ఏరుకునే వ్యక్తి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది సాయంతో ఆ పసికందును వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108 డ్రైవర్ సాంబశివరావు శిశువు పరిస్థితి గమనించి బొల్లాపల్లిలో నివాసం ఉంటున్న ఆయన సతీమణి సరళి సహాయంతో బాలుడి ఒంటిపై ఉన్న రక్తపు మరకలు తుడిసి పలు సేవలు అందించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేష్ ప్రైవేటు వైద్యశాలలోని శిశువుని పరిశీలించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలతకు పసికందును అప్పగించారు. ఆమె ప్రైవేటు వైద్యశాల నుంచి గవర్నమెంట్ వైద్యశాలకు శిశువుని తరలించి వైద్యసేవలు అందించారు. వైద్యపరీక్షల అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి బాలునాయక్ సూచనల మేరకు 108 వాహనంలో గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో శిశువు మృతి చెందాడు. బాలుడిని కని కంపచెట్లలో పడేసిన కసాయి తల్లి వివరాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కంపచెట్లల్లో పడి ఉన్న పసికందు

పోలింగ్ సరళిని పరిశీలించిన ఆర్వో


ఏసీ కళాశాలలో స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులను చేరుస్తున్న ప్రక్రియని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల పోలింగ్ సరళిని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఏఆర్వో ఎన్‌షేక్ ఖాజావలి నిరంతరం పర్యవేక్షించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోనే ఉండి పోలింగ్ సరళిని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను వీక్షిస్తూ పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకొన్నారు. ప్రతి జిల్లాకు ఒక అధికారిని కేటాయించి ఆయా జిల్లాల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ పోలింగ్ శాతం వివరాలను తెప్పించుకొని ఎన్నికల సంఘానికి నివేదించారు. సాయంత్రం 4 గంటలకు చాలావరకు పోలింగ్ కేంద్రాలు ఖాళీ అయిపోయాయని, కొన్ని చోట్ల మాత్రం క్యూలైన్లలో ఓటర్లు ఉండటంతో వారికి స్లిప్పులు ఇచ్చి ఓటు వేయడానికి అనుమతి ఇచ్చినట్లు ఆర్వో నాగలక్ష్మి తెలిపారు. గతంలో కంటే పోలింగ్ శాతం గణనీయంగా పెరగడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తాము నిర్వహించిన స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చామన్నారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు వాహనాల్లో తరలిస్తున్నారని, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదులు ఏవీ రాలేదని చెప్పారు.



బ్యాలెట్ బాక్సులను ఏసీ కళాశాలకు తరలించిన ఎన్నికల సిబ్బంది

నేడు రాష్ట్ర బడ్జెట్

● సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపుల పైనే ఆశలు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఏమేరకు కేటాయింపులు చేశారోనన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని గుంటూరు జిల్లాలో ముందుకు తీసుకెళ్లడానికి నిధులు ఎంతో అవసరం. అలానే గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు నిధులు అవసరం ఉంది. ఈ దఫా బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే అవకాశాలున్నట్లు అంతా అంచనా వేస్తున్నారు. అమరావతి రాజధాని, అవుటర్ రింగురోడ్డు, నూతన రైలుమార్గం ప్రాజెక్టుకు కేంద్రమే నిధులు సమకూరుస్తుంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నూతన రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాజధాని రైతులు అమరావతి రాజధానికి కేటాయింపులు బాగుండాలని కోరుకుంటున్నారు. రోడ్లకు కొంతవరకైతే ప్యాచ్‌వర్కులు చేశారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదు. కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలకు నిధులు కేటాయిస్తేనే పనులు పురోగతిలోకి వస్తాయి.

ఆలపాటి గెలుపు తథ్యం: అనగాని

రేపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం ఎప్పుడో ఖాయమైందనీ, మెజార్టీ ఎంత వస్తుందనేది తేలాల్సి ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. జగన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందన్నారు. అసెంబ్లీకి రావటం జగన్‌రెడ్డికి ఇష్టం లేదనీ, బడుగు, బలహీన వర్గాలపై అతనికి ఎటువంటి ప్రేమలేదని విమర్శించారు. ప్రతిపక్ష హోదా లేకున్నా వెంకయ్య నాయుడు, సుందరయ్యలాంటి నాయకులు ప్రజల కోసం అసెంబ్లీలో పోరాటం చేశారన్నారు. జెమిలి ఎన్నికలే కాదు ఏ ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి ఘన విజయం వస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం ఏమీ లేదనీ, ఎవరు చేసిన పాపాలకు వారు అనుభవిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారంగా వ్యక్తిగత దూషణలకు పాల్పడిన పోసాని మురళీ కృష్ణను చట్టపరంగానే అరెస్టు చేశారని అనగాని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లపై వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని పోసాని వినకూడని మాటలు అన్నారని ఆరోపించారు.

లక్షా 5 వేల 614 మంది ఓటింగ్‌కు దూరం

● గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లోనే ఎక్కువ మంది
● ఓటు నమోదుకు ఉత్సాహంగా దరఖాస్తు
● తీరా నమోదైన తర్వాత ఓటు వేయని పట్టభద్రులు

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో ఏ విధంగా అయితే ఓటర్లు చైతన్యం ప్రదర్శిస్తారో అలాంటి వాతావరణం ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల పోలింగ్‌లో కనిపించలేదు. ఈ నియోజకవర్గంలో ఓటర్లంతా విద్యావంతులే. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువులు పూర్తి చేసి మూడేళ్లకు పైగా అనుభవం గడించిన వారే. ఓటు వేయడం అనేది ప్రాథమిక హక్కు. ఈ విషయం పట్టభద్రులందరికీ కొత్తగా చెప్పాల్సిన పని లేదు. అయినప్పటికీ ఓటింగ్‌కు చాలామంది ఈ ఎన్నికల్లో దూరమయ్యారు. ఓటరు నమోదులో చూపించిన ఉత్సాహం పోలింగ్ సందర్భంగా ప్రదర్శించలేకపోయారు. ఓటర్ల సంఖ్య 3,47,116 ఉండగా, వీరిలో కనీసం మూడు లక్షల మంది అయినా ఓటు వేస్తారని అంతా భావించారు. అయితే 2,41,502 మంది మాత్రమే ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. లక్షా 8 వేల 109 మంది ఓటర్లు కలిగిన గుంటూరు జిల్లాలో 71836 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అలానే ఎన్‌టీఆర్ జిల్లాలో 78063 మంది ఓటర్లుంటే 51,279 మంది ఓటు వేశారు. కృష్ణాలో 63114 మంది ఓటర్లుంటే 44125 మంది ఓటు హక్కుని వినియోగించుకొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ ఓటర్లు మరింత ఎక్కువ సంఖ్యలో ఓటు వేసి ఉంటే పోలింగ్ శాతం 75 వరకు చేరుకునేదే.

ఓటు ఇక్కడ... ఉద్యోగం వేరొక చోట

ఓటుహక్కు కలిగిన పట్టభద్రుల్లో చాలామందికి ఓటు ఇక్కడుండగా వాళ్ల ఉద్యోగ, వృత్తిరీత్యా నివాసం ఉంటున్నది వేరే ప్రాంతం కావడం పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కాకపోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఇక్కడి ఓటర్లు పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయడానికి ఇక్కడికి వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. కొంతమంది సిబ్బందికి కొన్ని డిపార్టుమెంట్‌లు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయలేదు. ఇది కూడా ఓటింగ్ పెరగకపోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు.

అక్రమాలపై విచారణ ప్రారంభం

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మెప్మాలో వెలుగు చూస్తున్న అక్రమాలు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మెప్మా ఎండీ తేజ్‌భరత్ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా మెప్మా పీడీ పి.శ్రీహరిని విచారణాధికారిగా నియమించారు. ఆయనతోపాటు మెప్మాలో పనిచేస్తున్న ఆరుగురు బృందం గురువారం విచారణ ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రుణాలు ఇచ్చేందుకు కొత్త గ్రూపులు ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చే విషయంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఇప్పటికే పలువురు ఆరోపణలు చేస్తూ మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డికి ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ బృందం బ్యాంక్‌లకు వెళ్లి ఎన్ని గ్రూపులకు రుణాలిచ్చింది, ఎంతమొత్తం ఇచ్చింది వివరాలు కావాలని కోరారు. అదే విధంగా వేలల్లో రుణాలిచ్చి లక్షల్లో బకాయిలు చూపిస్తున్నారంటూ ఫిర్యాదు చేసిన మేరీ ప్రసన్నకుమారిని పిలిపించి విచారించారు. తనకు కేవలం రూ. 10 వేలు మాత్రమే రుణం ఇచ్చారనీ, ఆ మొత్తం తిరిగి చెల్లించానని చెప్పారు. అయితే ఇంకా బ్యాంక్‌లో తాను సుమారు లక్షా 90 వేల రూపాయలు బకాయి ఉన్నట్లు చూపిస్తున్నారని వాపోయింది. ఈ విషయమై ఆర్పీలను పిలిపించి విచారించగా మేరీ ప్రసన్నకుమారికి ఇచ్చింది రూ. 10 వేలేననీ, మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ తీసుకుందని చెప్పారు. ఈ విధంగా గ్రూప్‌లో సభ్యులందరు ఎంతరుణం తీసుకున్నది తెలుసుకునేందుకు వారితో సమావేశం ఏర్పాటు చేయాలని విచారణాధికారి సూచించారు. పీడీ శ్రీహరి మాట్లాడుతూ ఆర్పీ రజియా, షాజిదాలను పిలిపించి విచారించినట్లు తెలిపారు. మేరీ ప్రసన్నకుమారికి రూ. 10 వేలు ఇచ్చి మిగిలిన డబ్బులు గ్రూప్‌లీడర్ కరీమా తీసుకున్నట్లు ఒప్పుకొని లేఖ రాసి ఇచ్చినట్లు తెలిపారు. ఈ విధంగా గ్రూప్‌లోని సభ్యులందరితో మాట్లాడి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐవీ ఇన్‌గర్సల్‌బాబు, టిఈఎల్‌హెచ్ జయ్‌కుమార్, టీఈలు రాణి, ఫణికుమారి, ఎస్‌పీఎంయూ సునీల్, ఏవో వినీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.


బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ప్రకాశం మెప్మా పీడీ పి.శ్రీహరి, టీమ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉన్నతంగా ఎదగడమే అసలైన విజయం

● ఒలింపిక్స్ అసోసియేషన్ ఇండియా ప్రెసిడెంట్ పీటీ ఉష
● ఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా ఉద్గమ్ జాతీయ క్రీడోత్సవాలు


పీటీ ఉషకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌ఆర్‌ఎం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాము ఎంచుకున్న రంగంలో గొప్పగా రాణించి పతకాలు సాధిస్తే సరిపోదనీ, జీవితంలో ఉన్నతంగా ఎదిగినప్పుడే నిజమైన విజయం సాధించినట్టుని భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు, పద్మశ్రీ పీటీ ఉష అన్నారు. మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో ఉద్గమ్-25 జాతీయ క్రీడోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీటీ ఉష క్రీడా జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. కృషి, పట్టుదల, ఏకాగ్రత ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. క్రీడలతో విద్యార్థుల్లో సంఘటిత శక్తి పెరుగుతుందన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి క్రీడల్లో ప్రతిభ చూపడం వల్లనే తాను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నానని చెప్పారు. మంచి నడవడికతో తాము చదువుకున్న విశ్వవిద్యాలయానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. వీసీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఒలింపిక్స్‌లో వర్సిటీ విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ అనూప్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ సునీత క్రీడల అభివృద్ధికి ఎస్‌ఆర్‌ఎం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ ఏడాది పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు రెండు వేల మందికి పైగా పాల్గొంటున్నారని తెలిపారు. వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మార్చి ఒకటో తేదీన జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు రూ.పది లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ నుంచి క్రీడల్లో రాణిస్తున్న జెస్సీరాజ్ (స్కేటింగ్), బాలప్రసాద్‌రెడ్డి (రన్నింగ్), ఆకుల హైమలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ వినాయక్, సీఎఫ్ ఏవో సుమ, రీసెర్చ్ డీన్ రంజిత్, డైరెక్టర్ సిద్ధార్థ, రేవతీ బాలకృష్ణ, శ్రీపతి, వంశీ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుని గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం కె.సైమన్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ గతంలో ఉన్న షటిల్ కోర్టులో అనేక సమస్యలు ఉండటం వలన బ్యాడ్మింటన్ పోటీలకు అనువుగా ఉండేది కాదన్నారు. ఇప్పుడు చల్లని గాలి నిర్వహణతో ఎయిర్ వెంటిలేషన్ వ్యవస్థని అభివృద్ధి చేశామని, ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టమ్‌ని మెరుగుపరిచామన్నారు. మోకాలి కుదుపుల విషయంలో ఆటగాళ్ల రక్షణ కోసం కోర్టు మొత్తం తొలగించి సరికొత్త రబ్బర్ కుషన్ టెక్నాలజీతో కలపను అమర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అధికారులు ఎం.రవీంద్రనాథ్, సీహెచ్ ప్రదీప్‌కుమార్, జేవీ అనూష తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 530.60 అడుగులు ఉంది. ఇది 169.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1500, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,889 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	83, 90, 100
చికెన్ విత్ స్కిన్	160.00
చికెన్ స్కిన్ లెస్	170.00

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మెల్సీ ఎన్నికలు

● కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్


బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పోలింగ్‌బూత్‌లో ఓటింగ్‌సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన, కూటమి అభ్యర్థి ఆలపాటి, మానం విజేత తదితరులు

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్స్ శాసన మండలి కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం జరిగిన శాసనమండలి ఎన్నికల ప్రక్రియను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కూటమి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పోలింగ్ సరళిని పరిశీలించి కూటమి శ్రేణులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 33 నియోజకవర్గాలలో 483 పోలింగ్‌బూత్‌లలో ఎన్నికలు శాంతియుతంగా జరుగుతున్నాయన్నారు. 3లక్షల 50వేల మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రగతికి ప్రతిఒక్కరు ఓటు వేస్తున్నారని సుస్థిరమైన పాలనవైపు ప్రజలు చూస్తున్నారన్నారు. గత అరాచక, విధ్వంస పాలనకు వ్యతిరేకంగా అభివృద్ధి, సంక్షేమం వైపు ఓటర్లంతా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగ, ఉపాధికల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా సూపర్‌సిక్స్ అమలు చేయటం తథ్యమన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆలపాటి విజయం తథ్యమన్నారు. ఒక మంచి ప్రభుత్వానికి ఓటువేయాలనే ఆకాంక్షతో పట్టభద్రులంతా ముందుకొచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత, పట్టణ, మండల అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వరరావు, మహిళానాయకులు పల్లం సరోజినీ, కాగిత నాగభూషణమ్మ, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, షేక్.నజ్మా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో..


అధికారులతో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామ పంచాయతీలోని పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 1217మంది పట్టభద్రులు ఉండగా కళాశాలలో ఏర్పాటు చేసిన 411, 411ఎల పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్డీవో పి.గ్లోరియా, బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎన్నికల ప్రెసిడింగ్ అధికారి పి.శ్రీనివాసరావు ఎన్నికల ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాపట్ల డీఎస్పీ రామాంజనేయుల పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ పి.హరికృష్ణ, చందోలు ఎస్ఐ స్వామి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు, సర్వేయర్ ఆది రామచంద్రరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. తొలుత బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులతో కలిసి పోలింగ్ కేంద్రానికి విచ్చేసి పట్టభద్రుల ఎన్నికల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు.

డాక్టర్ గ్లోరియానేట్ దంపతులకు వేగేశన అభినందనలు

పిట్టలవానిపాలెంలో గురువారం జరిగిన ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఓటు హక్కు వినియోగించుకున్న తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, డాక్టర్ అబ్రహం వెస్లీ దంపతులను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అభినందించారు.

కర్లపాలెం మండలంలో 78.2 శాతం పోలింగ్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కర్లపాలెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్‌బూత్‌లలో 1172 ఓట్లు ఉండగా 910 ఓట్లు పోలయ్యాయని 78.2 శాతం ఓటింగ్ నమోదైందని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. గురువారం ఎన్నికలు ప్రారంభమైన తర్వాత ఎన్నికల సరళిని శాంతిభద్రతలను ఎస్పీ తుషార్‌డూడీ, బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు పర్యవేక్షించారు. ఈక్రమంలో భాగంగా ఎన్నికల జరుగుతున్న తీరును జిల్లా రెవెన్యూఅధికారి గంగాధర్‌గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ఏజెంట్లను బెదిరించారు..

● సీపీఎం రాష్ట్ర నాయకురాలు రమాదేవి

కొల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పీడీఎం తరఫున పోలింగ్ బూత్‌ల్లో ఉండే ఏజెంట్లను అధికార పక్షం నాయకులు బెదిరించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు ధూళిపాళ్ల రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొల్లూరులో ఓ పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించిన అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పక్షం నాయకులు, ఉద్యోగులు, ఏజెంట్లను బెదిరింపులకు గురిచేసే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆమె ఆరోపించారు. బుధవారం రాత్రి కొల్లూరు, చుండూరు మండలాల్లో పీడీఎం తరఫున పోలింగ్ బూత్‌లలో ఉండే వారిని బూత్‌లలో కూర్చోవద్దని హెచ్చరించడం ఇందుకు నిదర్శనమన్నారు. 56 శాతం ఓట్లతో కూటమి అధికారంలోకి వచ్చిందని, పట్టభద్రుల స్థానానికి చదువుకున్న వారు పోటీ చేయాల్సి ఉండగా అధికార పక్షం తమ పార్టీ అభ్యర్థుల్ని నిలబెట్టి ఈ విధంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఎక్కడబడితే అక్కడ పీడీఎఫ్ అభ్యర్థికి ఓట్లు పడకుండా చేసేందుకు కూటమి శ్రేణులు అడ్డుపడుతున్నారన్నారు. ఎక్కడ కూడా 144 సెక్షన్ అమలు కాలేదని, అధికార పక్షం సభ్యులు గుంపులు గుంపులుగా పోలింగ్ బూత్‌ల వద్ద దొంగ ఓట్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పట్టభద్రులు విజ్ఞతతో ఓటు వేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆమె వెంట బీఎల్‌కె ప్రసాద్, బొనిగల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లేయులకు సింహస్వప్నం ఆజాద్ : పీసీ.సాయిబాబు

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బ్రిటీష్‌వారి గుండెల్లో నిద్రించి వారికి చంద్రశేఖర్ ఆజాద్ సింహస్వప్నంగా నిలిచారని ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు పేర్కొని ఆజాద్ 94వ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాఇబాబు మాట్లాడుతూ భారతస్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న తొలి సాయుధపోరాటయోధులు ఆజాద్ అన్నారు. ఆంగ్లేయు అధికారులపై ప్రతీకారం తీర్చుకొని భారతీయుల సత్తా చాటారన్నారు.ఆయన త్యాగం నిరూపమానమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమ్మద్‌బాషా, సాహితి భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, ఉపాధ్యాయ సంఘనాయకులు బడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

● రేపల్లె నియోజకవర్గంలో 72.7శాతం పోలింగ్
● పోలింగ్‌బూత్‌లను పరిశీలించిన మంత్రి అనగాని, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ


ఓపెన్ థియేటర్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌బూత్‌లో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, నగరం, చెరుకుపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు రేపల్లె నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. నియోజకవర్గంలోని రేపల్లెలో ఐదు బూత్‌లు ఉండగా రేపల్లెరూరల్ మండలం పిరాట్లంకలో ఒక్కటి, నిజాంపట్నం మండలం అడవులదీవి, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరిగాయి. రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు అధికారుల సమష్టికృషితో జరిగాయన్నారు. నియోజకవర్గంలో 9,130ఓట్లు ఉండగా 6,638ఓట్లు పోలయ్యాయని తెలిపారు. మొత్తం 72.7శాతం పోలయ్యారన్నారు. రేపల్లె టౌన్‌లో నాలుగుబూత్‌లకు గాను 2,920ఓట్లు ఉండగా 2,129ఓట్లు పోలయ్యాయి. రేపల్లె రూరల్లో రెండు పోలింగ్‌బూత్‌లు ఉండగా 990 ఓట్లకుగాను 775 ఓట్లు పోలయ్యాయి. చెరుకుపల్లి మండలంలో మూడు పోలింగ్‌బూత్‌లు ఉండగా 2,050ఓట్లు ఉండగా 1,513ఓట్లు పోలయ్యాయి. నగరం మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉండగా 1590 ఓట్లు ఉండగా 1090ఓట్లు పోలయ్యాయి. నిజాంపట్నం మండలంలో రెండు పోలింగ్‌బూత్‌లు ఉండగా 1580 ఓట్లు ఉండగా 1131 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రెవెన్యూశాఖామంత్రి అనగానిసత్యప్రసాద్ సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. కాసేపు ఓటర్లతో ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంకటమురళి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. ఎన్నికల అధికారులకు నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. రేపల్లె పట్టణంలోని ఓపెన్‌థియేటర్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను ఎస్పీ తుషార్‌డూడీ పరిశీలించి పట్టణ సీఐ మల్లికార్జునరావును వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేపల్లె తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు బూత్‌లను ఎన్నికల కేంద్రాలను పరిశీలించారు.


పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుతో సీఐ మల్లికార్జునరావును అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ


పట్టణంలో ఓపెన్‌థియేటర్‌లోని పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు

నియోజకవర్గ స్థాయిలో 74.64 శాతం పోలింగ్

● 80.06 శాతం అమృతలూరు మండలంలో పోలింగ్
● వేమూరు మండలంలో 72.28 శాతం పోలింగ్
● కేంద్రాలను సందర్శించిన ఎస్పీ తుషార్‌డూడీ
● పోలింగ్ సరళిపై ఆరా తీసిన ఎమ్మెల్యే ఆనందబాబు


ఓటింగ్ సరళి గురించి ఎమ్మెల్యే ఆనందబాబుకు వివరిస్తున్న టీడీపీ శ్రేణులు


కొల్లూరులో బారులు తీరిన ఓటర్లు


కొల్లూరులో ఓటు వేసేందుకు వీల్‌ఛైర్‌లో వచ్చిన దివ్యాంగుడు

వేమూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఐదు మండలాల పరిధిలోని 10 పోలింగ్ కేంద్రాల్లో 8640 మంది ఓటర్లు ఉండగా 6485 మంది ఓట్లు వినియోగించుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో 74.64 శాతం పోలింగ్ నమోదైంది. కాగా అమృతలూరు మండలంలో 80.06శాతం పోలింగ్ జరిగి ప్రథమ స్థానంలో నిలిచింది. వేమూరులో 75.28 శాతం పోలింగ్ జరిగి ద్వితీయ స్థానం లో నిలిచింది. వేమూరు మండల సరళిని పరిశీలిస్తే 1663 ఓటర్ల కు గాను 1252 మంది ఓటు వేశారు. భట్టిప్రోలు మండలం లో 1972 మందికి గాను 1446 మంది ఓటు వేశారు. చుండూరు మండలంలో 1617 మందికి గాను 1194 మంది ఓటు వేశారు. 71.67 శాతం పోలింగ్ నమోదైంది. అమృతలూరు మండలంలో 1577 మందికి గాను 1265 మంది ఓటు వేయగా 80.06 శాతం పోలింగ్ నమోదైంది. కొల్లూరు మండలంలో 1809 మందికి గాను 1328 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.04 శాతం పోలింగ్ నమోదైంది.

● **కొల్లూరు, భట్టిప్రోలు, (ఆంధ్రజ్యోతి)** : కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 395, 396, 397, 398 పోలింగ్ బూత్‌లలో ఉదయం 7గంటల నుంచి ఓటింగ్ ప్రారంభమయ్యాయి. కొల్లూరులో తొలుత మందకొడిగా పోలింగ్ ప్రక్రియ సాగినప్పటికీ అనంతరం ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలిరావడంతో 73.04 శాతం నమోదైంది. నూతనంగా ఓట్లు పొందిన పట్టభద్రులు ఉత్సాహంగా ఓటు వేసేందుకు తరలి వచ్చారు. మహిళలు సైతం తమ చంటి బిడ్డలతో వచ్చి ఓటు వేసేందుకు ఉత్సాహం చూపించడం విశేషం. కొల్లూరు మండలంలో మొత్తం 1809 ఓట్లు ఉండగా 1328 ఓట్లు పోలయ్యాయి. భట్టిప్రోలు మండలంలో మొత్తం 1972 ఓట్లు ఉం డగా 1446 ఓట్లు పోలయ్యాయి. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో పర్యటించి టీడీపీ శ్రేణులను ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

● **అమృతలూరు (ఆంధ్రజ్యోతి):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రు లు 80 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో 1577 మంది పట్టభద్రులు ఉండగా 1265 మంది ఓటు వేసినట్లు ఆయన చెప్పారు.

● **చుండూరు, (ఆంధ్రజ్యోతి)** : చుండూరు జడ్పీ పాఠశాలలో రెండో పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేశారు.. మండలంలోని మొత్తం ఓటర్ల సంఖ్య 1617 ఉండగా 1194 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకే అత్యధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.


అమృతలూరులో క్యూలైన్‌లో వేచి ఉన్న పట్టభద్రులు


వేమూరులో చంటిబిడ్డతో ఓటు వేయడానికి వచ్చిన మహిళ


వేమూరులో ఓటు వేయడానికి వస్తున్న దివ్యాంగ మహిళ

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న రద్దీ


ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ


జ్ఞాపికలతో భరతనాట్య బృందం చిన్నారులను సత్కరిస్తున్న ఈవో అశోక్‌కుమార్, తదితరులు


బాలకోటేశ్వరుడికి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అమృతలూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల భక్తుల రద్దీ గురువారం కొనసాగింది. ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాలు 5 రోజుల పాటు కొనసాగడం ఆనవాయితీగా ఉంది. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధ్వజ స్తంభం వద్ద టెంకాయలు కొట్టి స్వామి వారికి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగాయి. బొమ్మల దుకాణాల్లో, గృహోపకరణాలు కొనుగోలుకు మహిళలు శ్రద్ధ కనబరిచారు. పలు గ్రామాలకు చెందిన విద్యుత్ ప్రభలు కనక తప్పెటుతో, వేకువజామున ఆలయానికి తరలి వచ్చి ప్రదక్షిణలు చేశాయి. మహాశివరాత్రి పర్వదినం రోజుల ఆలయ ప్రాంగణంలో ఖ్యాతి భరత నాట్యమండలి చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం వారిని ఈవో అశోక్‌కుమార్, కమిటీ సభ్యులు పావులూరి రమేష్, మండవ నాగమల్లే శ్వరి, తదితరులు జ్ఞాపికలతో సత్కరించారు.

వైభవంగా లింగోద్భవ అభిషేకం

ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడలోని శ్రీబాలకోటేశ్వర స్వామి వారికి బుధవారం అర్ధరాత్రి లింగోద్భవకాలాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్వామి వారికి మహారుద్రాభిషేకంతో పాటు, పంచ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు జరిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈవో అశోక్‌కుమార్ శ్రీబాలకోటేశ్వర స్వామికి ఆలయ మర్యాదలతో పట్టు వస్త్రాలు సమర్పించారు.

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ పర్యవేక్షణ


పోలింగ్‌బూత్‌లో పోలింగ్ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేషన్ శాసన మండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సరళిని గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. సెక్టార్, రూట్ ఆఫీసర్‌లకు పలు సూచనలు చేశారు. అనంతరం బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. మున్సిపల్ హైస్కూల్‌లోని 413, 414, 413ఎ,416, 416ఎ పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కువినియోగించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో జి. గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాధరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మున్సిపల్ హైస్కూల్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బందోబస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు ఓటింగ్ సరళిని పరిశీలించి ఓటర్లకు కల్పించిన వసతులను చూశారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ నారాయణ, డీఎస్పీ రామాంజనేయులు, పట్టణ సీఐ రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత భోగేశ్వరస్వామి గ్రామోత్సవం


నంది వాహనంపై ఊరేగుతున్న గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి

కొల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గంగా పార్వతీ సమేత అనంత బోగేశ్వర స్వామి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామికి బలిహరణ కార్యక్రమం నిర్వహించి నందివాహనంపై స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పసుపు నీళ్ల చల్లి హారతులు ఇచ్చారు. శుక్రవారం అశ్వ వాహన సేవ, పాలోత్సవం, హోమం, రథోత్సవం, తిరునాళ్ల కార్యక్రమం జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.10లక్షల 52వేల 647

రేపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బాలకోటేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు మాట్లాడుతూ ఆదాయం లెక్కింపులో రూ.10లక్షల 52వేల 647లు వచ్చాయని తెలిపారు. 2023-24సంవత్సరానికి రూ.10లక్షల 25వేల 601రాగా గత సంవత్సరం కంటే ఆదాయం 27వేల 046రూపాయలు అధికంగా వచ్చిందని తెలిపారు. మహాశివరాత్రికి సహకరించిన వివిధ శాఖల అధికారులకు గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కనులపండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో శ్రీగోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణం విశ్వబ్రాహ్మణకాలనీలో ఉన్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం భక్తులు వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో దంపతులతో స్వామివారి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. కల్యాణోత్సవం విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, సూరిబాబు, విగ్రహదాతలు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణ మహోత్సవం


శాంతికల్యాణం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

బాపట్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్లో వేంచేసియున్న శ్రీరుక్మిణిసమేత పాండురంగాస్వామి దేవాలయ ప్రాంగణంలో ఉమామహేశ్వరస్వామికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పంచామృతస్నపన కార్యక్రమం నిర్వహించి గురువారం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేష శాంతి కల్యాణమహోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో స్వామివారి కల్యాణానికి పీటలమీద మురళి వెంకటరమణ నీరజాదేవి, ఆలయ ధర్మకర్త మార్పూరి బద్రీనారాయణ దంపతులు కూర్చోన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురామచార్యులు పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

కేదారేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో శ్రీబదరీకేదారేశ్వరస్వామి

కర్లపాలెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ గంగా గౌరిసమేత బదరికేదారేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి లింగోద్భవకాలంలో మహన్యసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాన్ని అర్చకులు అంగరంగవైభవంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం నలుమూలలు నుంచి వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామివారికి చేసిన విశేష అలంకరణ భక్తులకు కన్నుల పండుగగా నిలిచింది. ఆలయ పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రక్షాళన దిశగా కుందేరు వాగు

» కలెక్టర్ సమీక్షతో అధికారుల్లో కదలిక

» ఆక్రమణదారుల్లో మొదలైన దడ


చీరాలలోని కుందేరు వాగు

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కుందేరు వాగు బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో ప్రవహిస్తోంది. చీరాల పరిధిలోని కుందేరు ఆక్రమణలకు గురై నేడు బక్కచిక్కి ఉంది. అయితే గత రెండు రోజుల కిందట అధికారులతో కలెక్టర్ వెంకటమురళి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆక్రమణలను తొలగించాలని కచ్చితమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆదిశగా కుందేరు ప్రక్షాళన చర్యలు మొదలైతే తమ పరిస్థితి ఏంటని ఆక్రమణదారుల్లో దడ మొదలైంది.


కుందేరుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి(ఫైల్)

కుందేరు భౌగోళిక చరిత్ర

బ్రిటీష్‌వారి సమయంలో ప్రజలు, రైతులకు తుఫాన్, వరదలను ఎలాంటి ముప్పు లేకుండా ఉండేందుకు కేందేరును తవ్వారు. దానిపై కన్నేసిన ఆక్రమణదారులు పెద్దఎత్తున రెండువైపులా ఆక్రమించి ని ర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రజలకు రక్షణ కవచంలా ఉండాల్సిన కుందేరు కబ్జాకోరల్లో చిక్కుకుపోయింది. తాజాగా అధికారుల నిర్ణయాలతో ప్రజలకు మేలు చేకూరే అవకాశం కనపడుతుంది. అధికారుల మాటలు నీటిమూటలైతే భవిష్యత్‌లో ముంపు బాధలు పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు.

జిల్లాలో కుందేరు వాగు ప్రభుత్వ రికార్డుల ప్రకారం బాపట్ల మండలం పేరలి మొదలుకుని బాపట్ల, వెదుళ్లపల్లి, చీరాల, వేటపాలెం, చినగంజాం వరకు ప్రవహిస్తుంది. ఈ విధంగా చూసుకుంటే బాపట్ల మండలంలో 97.20, చీరాల మండలంలో 267, వేటపాలెంలో 650, చినగంజాంలో 460 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. అయితే చీరాల పరిధిలో నేడు ఆ వాగు వాస్తవికతకు చాలా భిన్నంగా మారింది. ఎంచక్కా అవకాశవాదులు ఇష్టారీతిగా ఆక్రమించారు. మరి కొందరు కుందేరును కొంచెం కొంచెంగా పూడ్చి లేఅవుట్‌లు సైతం వేసుకుని వ్యాపారాలు చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం ఉంది. మరికొంత మంది వ్యవసాయ భూముల్లో అవకాశం ఉన్న మేరకు స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నారు. అయితే దీనిపై గతంలో అనేక మంది అధికారులకు ఫిర్యాదులు చేయడంతో పలు మార్లు వ్యవహారం రచ్చకు వచ్చింది. అయితే తాజాగా కలెక్టర్ వెంకటమురళి అధికారులతో సమీక్షించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. భిన్నంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ఒక్క చీరాల నియోజకవర్గ పరిధిలోని పెద్ద ఎత్తున ఆక్రమణాలు జరిగాయంటే ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదన్నది జగమెరిగిన సత్యం. అయితే అధికారులు తీసుకునే చర్యలు పారదర్శకంగా ఉంటాయా ఒకవేళ అదే జరిగితే ఆక్రమణదారులపై ఉక్కుపాదం తప్పదా అనేది వేచి చూడాల్సి ఉంది. అయితే వాగు ఆక్రమణలకు సంబంధించి తాజాగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నారు.


మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, అధికారులు (ఫైల్)

రాతి ముఖ మండపం పనులు ఆలస్యం

» అందుబాటులో లేని మంచి ముహూర్తాలు

» ఈఏడాది వార్షిక తిరునాళ్లకూ బాలాలయంలోనే స్వామి దర్శనం


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న రాతి ముఖ మండప పునఃనిర్మాణ పనులు

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులు ఒకింత ఆలస్యం అవుతుండడంతో ఈ ఏడాది వార్షిక తిరునాళ్లకు కూడా బాలాలయంలోనే ప్రసన్నాంజనేయస్వా మి దేవాలయంలో స్వామి వారి దర్శనం ఉండనుంది. దీంతో భక్తులు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం పునఃనిర్మాణ పనులు సుమారు రూ.7కోట్లతో జరుగుతున్నాయి. ఈవోగా తిమ్మానాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత పనులు ఒకింత వేగవంతంగా జరుగుతుండగా, వార్షిక తిరునాళ్ల నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని భావించారు. మూలవిరాట్ వద్దనే తిరునాళ్ల పూజలు, భక్తులకు దర్శనం కల్పించాలని భావించారు. పనులు పూర్తికావడానికి మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం కనిపిస్తుండగా, మంచి ముహూర్తాలు కూడా లేనట్లు తెలుస్తుంది. వార్షిక తిరునాళ్ల మార్చి 14 వతేదీన జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా తిరునాళ్లకు వచ్చే భక్తులు బాలాలయంలోని స్వామి వారిని దర్శించుకోవడంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండడంతో భక్తులు ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏప్రిల్, మేలో రాతి ముఖమండపం ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

సర్వే భూములను పరిశీలించిన ఆర్డీవో


సర్వేను పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఇంకొల్లు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపులపాడు గ్రామ పరిధిలో రీ-సర్వే జరుగుతున్న భూములను గురువారం చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు గురువారం పరిశీలించారు. రైతులను అడిగి సర్వే వివరాలను తెలుసుకున్నారు. భూముల రీసర్వే సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ వెంకటరత్నం, డీటీ భాగ్యారావు, సర్వేయర్ మునలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సారాకు దూరంగా ఉండండి


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీకి దూరంగా ఉండి.. కుటుంబాలతో ఆనందంగా జీవించాలని ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, సూపరింటెండెంట్ జనార్దన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమం గురువారం రామనగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ సారా ఉత్పత్తిలో రామనగర్ మొదటి స్థానంలో ఉందని వివరించారు. జీవితాలను చిన్నాభిన్నం చేసే సారా నియంత్రణకు సహకరించాలని, భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెదగంజాంలో ఉచిత కంటి వైద్య శిబిరం


చినగంజాం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : పెదగంజాంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ గురువారం ప్రకటనలో తెలిపారు.

శరవేగంగా విద్యుత్‌లైన్ విస్తరణ

» మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో చకాచకా పనులు

» ఆనందం వ్యక్తం చేస్తున్న ఎస్టీకాలనీ వాసులు


జాగర్లమూడివారిపాలెం ఎస్టీకాలనీ వరకు వేసిన విద్యుత్‌లైన్


కాలనీలో వెలుగుతున్న వీధి లైట్లు

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో జేవీపాలెం ఎస్టీకాలనీ విద్యుత్ లైన్ విస్తరణ పనులు శరవేగంగా పూర్తయ్యాయి. దీర్ఘ కాలంగా విద్యుత్ లైన్‌ను ఏర్పాటు లేక తాము పడుతున్న ఇబ్బందులను జాగర్లమూడివారిపాలెం ఎస్టీ కాలనీవాసులు, గ్రామ నాయకులు ఈ నెల ఒకటవ తేదీన ముప్పవరం పార్టీ కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎదుట ఏకరువు పెట్టారు. సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ ఈఈ మస్తాన్‌రావును ఆదేశించారు. రంగంలోకి దిగిన అధికారులు విద్యుత్‌లైన్ విస్తరణ పనులకు అంచనాలు రూపొందించి, నిర్వహణ పనులకు నిధులను కేటాయించారు. త్వరిత గతిన నిర్మాణ పనులు పూర్తిచేసిన అధికారులు గురువారం కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. తాము కోరిన వెంటనే విద్యుత్ సమస్య పరిష్కరించిన మంత్రి రవికుమార్‌కు కాలనీ వాసులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రామకోటేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

చినగంజాం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో నిర్వహించిన తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. అభిషేకాలు, కుంకమపూజలు ద్వారా రూ.3,16,500, హుండీ ద్వారా రూ.4,51,438 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రూ.7,67,938 ఆదాయం రాగా బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుమ్మలపెంట సీతారామయ్య, టీ.జయరావు, వెంకటసుబ్బారావు, టి.వెంకటస్వామి, పర్వతరెడ్డి హరిబాబు, పల్లపోలు లక్ష్మీనారాయణ, కే.రామసుబ్బారావు, పి.శరభారావు, నున్నా హరనాథ్‌బాబు, నరహరి శ్రీనివాసరావు, టీ.సుబ్బారావు, పి.పార్థసారిధి, ధర్మవరపు ఏసునారాయణ, టి.చిన్నా, పి.పద్మనాభయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులతో రూ.8.60 లక్షల ఆదాయం

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు అద్దంకి డిపో నుంచి బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 27 బస్సులను నడపగా రూ.8,61,498 ఆదాయం వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. గత ఏడాది 30 బస్సులను నడపగా రూ.7,96,985 ఆదాయం రాగా, ఈ ఏడాది మూడు బస్సులు తక్కువగా నడిపినప్పటికీ రూ.65వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎక్కువ ఆదాయం వచ్చేలా కష్టపడ్డ కార్మికులకు డీం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి అభినందనలు తెలిపారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో స్వామి

బల్లికురవ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ-సంతమాగులూరు రోడ్డు నక్కబొక్కలపాడు గ్రామ పరిధిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి కల్యా ణం గురువారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా పూ జారి మధుబాబు ఆధ్వర్యంలో దేవతా మూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీనులవిందుగా జరిపించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా అగస్తేశ్వరస్వామి గ్రామోత్సవం


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చెరుకూరు (పర్చూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅగస్తేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి లింగోద్భవం అనంతరం స్వామివారిని ప్రత్యేక పల్లకిలో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగయ్య అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

» కోరంలేక ఆలస్యంగా ప్రారంభం

» అంతంతమాత్రంగా హాజరైన కౌన్సిలర్‌లు

» రూ.15కోట్లతో మినీ బైపాస్‌కు ప్రతిపాదనలు

» నష్టం వచ్చే టెండర్‌లు రద్దు


మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సమావేశం గురువారం మొక్కుబడిగా సాగింది. కోరం లేక చైర్‌పర్సన్ వచ్చిన తరువాత 10 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. మున్సిపల్ సమావేశం గురువారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 46 అంశాలకుగాను మున్సిపాలిటీకి నష్టం వచ్చే విధంగా వేసిన 6 పనులకు సంబంధించిన టెండర్‌లను రద్దు చేసి రీటెండర్ పిలవాలని తీర్మానించారు. 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11-20కి చైర్‌పర్సన్ వచ్చారు. అప్పటికి కోరంకు సరిపడా కౌన్సిలర్‌లు రాకపోవడంతో మరో 10 నిమిషాలు వేచి ఉండి 11-30 గంటలకు ప్రారంభించారు. 46 అంశాలు ఉన్న అజెండా సుమారు 30 నిమిషాల పాటు సాగిన సమావేశంలో 40 అంశాలను ఆమోదించారు. 6 అంశాలకు సంబంధించిన టెండర్‌లు 4.99 శాతం అధికంగా కోడ్ చేయడంతో మున్సిపాలిటీకి నాలుగైదు లక్షల నష్టం వచ్చే అవకాశం ఉండడంతో వాటికి సంబంధించి రీటెండర్‌లు పిలవాలని నిర్ణయించారు. అభివృద్ధి పనులపై అటు వైసీపీ, టీడీపీ కౌన్సిలర్‌లు పెద్దగా నోరు విప్పి మాట్లాడలేదు. 20వ వార్డు కౌన్సిలర్ కోటేశ్వరరావు మాత్రం శింగరకొండ తిరునాళ్ల నాటికి నామ్ రోడ్డులో సెంటర్ లైటింగ్‌లో మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. గతంలో రద్దు చేసిన టెండర్‌లను వెంటనే పిలిచి పనులు పూర్తి చేయాలని కోరారు. హాజరైన పలువురు కౌన్సిలర్‌లు సంతకాలు చేసి వెళ్లి పోవడంతో సమావేశంలో కౌన్సిలర్ హాజరు తక్కువగా ఉంది. పలు సందర్భాలలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర వివరణ ఇస్తూ అద్దంకి పట్టణంలోని కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు మంత్రి రవికుమార్ ఆదేశాలతో రూ.15కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దర్శి రోడ్డులో డివైడర్ మధ్య గ్రీనరీ పెంచి, రక్షణగా ఇనుప కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీటి క్లోరినేషన్‌కు చర్యలు చేపడతామన్నారు. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్‌లు, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సాగుభూముల్లో రోడ్డు నిర్మాణం చేపట్టొద్దు

తూర్పు కొప్పెరపాడు దళిత రైతుల విజ్ఞప్తి

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తమ భుక్తి కోసం కేటాయించిన సాగు భూమిలో రహదారి కోసం రోడ్డు నిర్మించే చర్యలు చేపట్టవద్దని తూర్పు కొప్పెరపాడు గ్రామ దళిత రైతులు తహసీల్దార్ సింగారావుకు విజ్ఞప్తి చేశారు. పంగులూరుకు చెందిన రైతు తమ పొలంలోకి వెళ్లేందుకు దారి కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా, సర్వే చేసేందుకు తహసీల్దార్ సింగారావు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై సీపీఎం నాయకులు రాయిణి వినోద్ దళిత రైతుల సమస్యపై గురువారం తహసీల్దార్‌ను ల్దార్ కలిసి సమస్యను వివరించారు. కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుక్ను వారికి ప్రభుత్వం గతంలో సర్వే నెంబరు 254లో 20 మందికి 30 నుంచి 40సెంట్ల బంజరు భూమిని కేటాయించినట్లు తెలిపారు. తాము సాగు చేసుకునే పట్టా భూమి మధ్యగా దారి కోసం రోడ్డు నిర్మా ణం చేపడితే తాము నష్టపోతామన్నారు. శనివారం సదరు భూమిని పరిశీలించి ఇబ్బంది లేకుండా చూస్తామని తహసీల్దార్ సింగారావు తెలిపార. కార్యక్రమంలో వీఆర్వో నూతలపాటి సుధాకర్, సర్వేయర్ ఎలీషా, సనందబాబు, రాంబాబు పాల్గొన్నారు.

దాబా ఘటనపై కేసు

మార్టూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి జొన్నతాళి సెంటర్ సమీపంలో దాబా హోటల్‌లో బుధవారం రాత్రి కోలలపూడి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు హోటల్ యజమాని గూగూలాతోపాటు సర్వర్ రాజుపై దాడి చేసిన ఘటనకు సంబంధించి గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రావూరి శ్రీకాంత్‌తో పాటు కొంత మంది వ్యక్తులు హోటల్‌లో టిఫిన్ చేసి బిల్లు ఇవ్వకుండా వెళుతున్న క్రమంలో, అదేమిటని అడిగిన హోటల్ యజమాని గూగూలా, సర్వర్ రాజుపై సీసాతో దాడిచేసి గాయపరిచారు. దాంతో గాయపడిన వారిద్దరూ మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. వారిలో గూగూలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గరుత్మంతుడు తెలిపారు.

ఇంటిలో చోరీ

8.5 సవర్ల బంగారు ఆభరణాలు మాయం

మార్టూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మద్దిసీతాదేవీనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు పచ్చవ శరణ్య అనే మహిళ ఇంటిలో చొరబడి బీరువాలో ఉన్న 8.5 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయిన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. వాటి విలువ దాదాపుగా రూ.5లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కాంప్లెక్స్‌కు వెళ్లేదారిలో టీవీఎస్ షోరూం సమీపంలో ఉన్న ఒక షాపులో వెంకటేశ్వర్లు శరణ్య దంపతులు మిషన్లు రిపేరు పనులు చేస్తుంటారు. గురువారం మధ్యాహ్న సమయంలో షాపు నుంచి ఇంటికి వెళ్లిన శరణ్య దుస్తులను ఉతికి ఆరవేసేందుకు డాబా పైకి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించారు. ఇంటిలో బీరువాకు ఉన్న తాళం చెవులను తీసుకొని బీరువా తలుపులు తెరచి నాలుగు సవర్లు గల డాలరుతో ఉన్న నల్లపూసలతాడు, 2 సవర్ల బ్రాస్‌లెట్, మరో రెండున్నర సవర్ల గొలుసు ఎత్తుకు పోయారు. కొంచెంసేపటి తర్వాత డాబా పైనుంచి కిందికి దిగి ఇంటిలోకి వెళ్లిన శరణ్య బీరువా తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శేషగిరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఎంకు మాతృవియోగం


సామ్రాజ్యం

పంగులూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల ప్రసాద్ తల్లి పుచ్చకాయల సామ్రాజ్యం (78) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమె భర్త దివంగత పుచ్చకాయల కృష్ణమూర్తి గతంలో పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ముప్పవరంలో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

కేఆర్‌కే మృతిపై ఎమ్మెల్యే ఏలూరి సంతాపం


కేఆర్‌కే ప్రసాద్

నాగులపాలెం (పర్చూరు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగులపాలెం కళావాణి వ్యవస్థాపకులు, కళాకారుడు కేఆర్‌కే ప్రసాద్ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. గురువారం కేఆర్‌కే మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏలూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రసాద్ మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. ప్రారంభం నుంచి మంచి కళాకారునిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు సినీ ప్రరిశ్రమల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. నేడు నాగులపాలెంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టీబీ రహిత గ్రామాల ఎంపిక

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2024 సంవత్సరానికి సంబంధించి టీబీ రహిత గ్రామాలుగా గోపాలపురం, ఉప్పలపాడు, పేరాయపాలెం పంచాయతీలు ఎంపికైనట్లు బాపట్ల జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ అధికారి డాక్టర్ సాదిక్ తెలిపారు. గురువారం మండలంలోని గోపాలపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గోపాలపురం, పేరాయిపాలెం, ఉప్పలపాడు గ్రామాలలో అన్ని రకాల టీబీ పరీక్షల అనంతరం జీరో కేసులు నమోదైనట్లు తెలిపారు. దీనిలో భాగంగానే గోపాలపురం గ్రామాన్ని సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, ఎస్‌టీసీఎస్ రాజశేఖర్, వెంకటరత్నం, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శింగరకొండలో ఘర్షణ

అద్దంకి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం యువకులు, దుకాణ నిర్వాహకుడి మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం ముగ్గురు యువకులు షాపు వద్ద కొనుగోలు కోసం వచ్చారు. ఈ సమయంలో మాటామంతి పెరిగి ఘర్షణ పడ్డారు. మిగిలిన షాపుల యజమానులు కూడా అక్కడకు చేరుకొని యువకులకు దేహశుద్ధి చేసి పంపారు. ఘర్షణ జరుగుతుండడంతో అక్కడ ఉన్న భక్తులు ఒకింత అయోమయానికి గురయ్యారు. యువకులు తప్పు చేసి ఉంటే అటు దేవాలయ సిబ్బంది, అధికారులు లేదా పోలీస్ లకు సమాచారం ఇచ్చి అప్పగించాల్సింది పోయి ఏకంగా దాడి చేయడం విమర్శలకు తావిస్తుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటన గురువారం రాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట చోటుచేసుకుంది. అతనికి సుమారు 41 సంవత్సరాలు ఉంటాయి. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతనివద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో మార్చి 4న జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సుకు దళితులందరూ హాజరై జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నిష్పత్తి ప్రకారం కేటాయించాలన్నారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు వెంటనే చెల్లించాలని, కుటుంబాలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కన్వీనర్ వీరయ్య, నాయకులు సింగరకొండ, జోసఫ్, హేబేలు, జ్యోతి రమేష్‌బాబు, ఆంజనేయులు, గద్దల రమేష్ పాల్గొన్నారు.